RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 270 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 3 ఏప్రిల్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# మళ్ళీ మొదలెట్టేశారు

## రైతుల పేరుతో రాజకీయం

## కాంగ్రెస్ సైడ్ అయిపోతుందా?

హైదరాబాద్ : ఎంపీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కనీసం 12 పార్లమెంట్ సీట్లు గెలవబోతున్నాయని సర్వే సంస్థలు అంచనా వేస్తున్నాయి. కాదు కాదు మేం 14సీట్లు గెలవబోతున్నాం అంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటిస్తున్న తరుణంలో బీజేపీ, బీఆర్ఎస్ రైతు రాజకీయం మొదలుపెట్టాయి. తెలంగాణలో పంటలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు వేగంగా అడుగంటి పోతున్నాయి. సరిగ్గా దీన్నే ఆసరగా తీసుకొని కేసీఆర్ రాజకీయం మొదలుపెట్టారు. కృష్ణా నదీ జలాల పంపకం మీద రాజకీయం చేయాలనుకున్నా అది వర్కవుట్ కాలేదు. అందుకే ఒకే సభ పెట్టి సైలెంట్ అయిపోయారు. కానీ ఇప్పుడు రాబోతున్న ఎంపీ ఎన్నికలు బీఆర్ఎస్ కు చావో రేవో అన్నట్లు తయారయ్యాయి. కనీసం ఒక్క సీటు అయినా గెలుస్తుందా అన్న అనుమానాలున్న సమయంలో కేసీఆర్ ఫాంహౌజ్ నుండి బయటకు రావాల్సిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పడ్డాయి. పైగా పార్టీ నుండి సీనియర్లు కేకే, కడియం వంటి వారు కూడా వెళ్లిపోతున్న నేపథ్యంలో లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయబోయే లీడర్లు సైతం మానసికంగా భయంలో పడిపోయారు. క్యాడర్ కూడా గందరగోళంగా ఉంది. దీంతో క్యాడర్ లో ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా కేసీఆర్ గ్రౌండ్ కు వెళ్తున్నారన్న అభిప్రాయం కూడా ఉంది. ఇప్పటికే నల్గొండలో రైతు పరామర్శ యాత్ర చేసిన కేసీఆర్, వారం రెస్ట్ తీసుకొని ఏప్రిల్ 5న కరీంనగర్ లో పర్యటించాలని భావిస్తున్నారు. ఎన్నిలొస్తున్న తరుణంలో తానేక్కడ వెనకపడిపోతానన్న భయంతో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రైతుదీక్షకు రెడీ అయ్యారు. కేసీఆర్ వచ్చే లోపే తాను దీక్షకు దిగుతున్నారు. కలెక్టరేట్ వద్ద రైతుదీక్ష చేస్తున్నట్లు ప్రకటించారు. ఓట్ల వేటలో వెనకపడొద్దన్నదే బండి దీక్షలోనూ అసలు విషయం అనేది ఓపెన్ సీక్రెట్. అయితే, బీఆర్ఎస్ బీజేపీలు రైతుల పేరుతో రాజకీయం చేయాలని ప్రయత్నిస్తున్నా కాంగ్రెస్ సైలెంట్ గా ఉ ఒడటంపై పొలిటికల్ సర్కిల్స్ లో చర్చ జరుగుతోంది.

కేసీఆర్ వాగ్ధాటికి, బండి సంజయ్ అటాకింగ్ కు తగ్గట్లుగా కాంగ్రెస్ నుండి కౌంటర్ పడలేదని ఇదే కంటిన్యూ కాంగ్రెస్ సైడ్ అయిపోవటం పక్కా అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## ఫోన్ ట్యాపింగ్‌లో అసలు సూత్రధారులు ఎవరు?



న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: రాష్ట్రంలో సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు స్పందించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌లో ఎవరెవరు ఉన్నారో తెలియాలన్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎవరెవరు ఏం మాట్లాడుతున్నారో రికార్డ్ చేసిందని ఆరోపించారు. ఇందులో ఇంకా చాలా అంశాలు బయటకు రావాలన్నారు. రాజకీయ నాయకులు, బిజినెస్ మ్యాన్‌ల ఫోన్లు ట్యాప్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో అసలు సూత్రధారులు ఎవరు అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఇప్పటికే పలువురు అధికారులు అరెస్ట్ అయ్యారని కాంగ్రెస్ సీనియర్ నేత తెలిపారు. నయీం అనే గ్యాంగ్ స్టర్ గతంలో కోట్ల రూపాయలు, భూములు కాజేశారని... నయీం మరణం తర్వాత అక్కడ దొరికిన డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. సిట్ అధికారిగా నాగిరెడ్డి ఉన్నారన్నారు. పేదల భూములు నయీం లాక్కున్నారని.. అవి ఏమయ్యాయని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి వీటి పై విచారణ జరిపితే ఆ భూములను పేద ప్రజలకు ఇవ్వొచ్చని సూచించారు. నయీం డబ్బులు ఏమయ్యాయో ఎవరు చెప్పలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్‌ను ప్రభుత్వం ఎలా సీరియస్‌గా తీసుకుందో .. నయీం డబ్బులు, ఆస్తులు ఏమయాయ్యో విచారణ జరపాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డిని ఇటీవల కలిశానని.. ఖమ్మం లోక్‌సభ సీటు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. రాజీవ్ గాంధీతో అక్కడే తిరిగానని గుర్తుచేశారు.

ఖమ్మం టికెట్ తనకిస్తే మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా.. దానికి కట్టుబడి ఉంటానని వీహెచ్ స్పష్టం చేశారు.




## సుర్రుమన్న సూరీడు..

హైదరాబాద్: ఎండలు భగ్గున మండుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే సూరీడు నిప్పులు కక్కుతున్నాడు. మధ్యాహ్నం వేళ బయటికి వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. తాజాగా మియాపూర్‌లో అత్యధికంగా 41.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమో దు కాగా, కందుకూరు, చందానగర్, నాగోల్‌లో 41.6 డిగ్రీలు, చిలుకూరు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 41.5 డిగ్రీలు, ఇబ్రహీంపట్నంలో 41.5, డిగ్రీలు, షాబాద్, రాచలూరు, అత్తాపూర్ తదితర మండలాల్లో 41.4 డిగ్రీల ఉష్ణోగ్రతల చొప్పున రికార్డు అయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో 40 నుం చి 40.9 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

**మీటరు గిరగిర..** భగ్గున మండుతున్న ఎండలకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు రోజంతా ఆన్‌లో ఉండటం, సామర్థ్యానికి మించి విద్యుత్ వినియోగిస్తుండటంతో సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు హీటెక్కుతున్నాయి. ఫీడర్లు ట్రిప్పవుతుండటంతో పాటు కండకర్లు, ఇన్సులేటర్లు వేడికి పేలిపోతున్నాయి.

## దండకారణ్యంలో భీకర ఎన్‌కౌంటర్.. 8 మంది మావోయిస్టుల మృతి



రాయ్‌పుర్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భీకర ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బీజాపుర్ జిల్లాలోని దండకారణ్యంలో భద్రతా సిబ్బంది, మావోయిస్టుల మధ్య మంగళవారం ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఎనిమిది మంది మావోయిస్టులను మట్టుబెట్టినట్లు భద్రతా దళాలు వెల్లడించాయి. బీజాపుర్ జిల్లాలోని లెంద్రా గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాగి ఉన్నట్లు సమాచారం రావడంతో యాంటీ-నక్సల్స్ ఆపరేషన్ చేపట్టారు. డీఆర్‌జీ, స్పెషల్ టాస్క్ ఫోర్స్, సీఆర్పీఎఫ్, కోబ్రా కమాండ్ యూనిట్ బలగాలు ఇందులో పాల్గొన్నాయి. అటవీ ప్రాంతంలో భద్రతా సిబ్బంది గాలింపు చేపట్టగా.. మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో బలగాలు ఎదురుకాల్పులు చేపట్టాయి. కాల్పులు ముగిసిన అనంతరం ఘటనాస్థలంలో ఎనిమిది మృతదేహాలను భద్రతా సిబ్బంది గుర్తించారు. లైట్ మెషిన్ గన్, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. సాధారణంగా ఏటా మార్చి-జూన్ మధ్య మావోయిస్టులు ఈ ప్రాంతంలో వ్యూహాత్మక ఎదురుదాడి శిక్షణ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. ఆ సమయంలోనే బస్తర్ ప్రాంతంలో భద్రతా బలగాలపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతాయని పోలీసులు వెల్లడించారు. ఈసారి లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దాడులు పెరిగే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పేర్కొన్నారు. మార్చి 27న కూడా బీజాపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్ జరిగింది. అందులో ఆరుగురు మావోయిస్టులను బలగాలు మట్టబెట్టాయి. తాజా ఘటనతో కలిపి బస్తర్ ప్రాంతంలో ఇప్పటివరకు జరిగిన పలు ఎదురుకాల్పుల్లో మొత్తం 41 మంది మావోయిస్టులు హతమైనట్లు పోలీసులు వెల్లడించారు. బీజాపూర్ జిల్లా బస్తర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉంది. ఈ స్థానానికి ఏప్రిల్ 19న తొలి విడతలోనే పోలింగ్ జరగనుంది.




## బండి సంజయ్ 'రైతు దీక్ష'

కరీంనగర్, ఏప్రిల్ 2: బీజేపీ ఎంపీ బండి సంజయ్ "రైతు దీక్ష" ప్రారంభమైంది. రైతు సమస్యల పరిష్కారం కోసం మంగళవారం ఉదయం జిల్లాలోని ఎంపీ కార్యాలయంలో బండి సంజయ్ రైతు దీక్ష చేపట్టారు. రుణమాఫీ, పంట నష్ట పరిహారం, రూ.500 బోనస్ హామీలను అమలు చేయాలంటూ బీజేపీ ఎంపీ దీక్షకు దిగారు. ఈరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దీక్ష కొనసాగంది.

**రైతుల పక్షాన బీజేపీ డిమాండ్లు ఇవే..** "తాలు, తేమ, తరుగుతో సంబంధం లేకుండా వడ్లను పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. ఇందిరమ్మ రైతు భరోసా కింద రైతులతోపాటు కౌలు రైతులుకు ఎకరాకు రూ.15 వేలు, భూమి లేని వ్యవసాయ కూలీలలకు రూ.12 వేలు ఇవ్వాలి. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని తక్షణమే అమలు చేయాలి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులతో అనుసంధానించాలి. రైతు కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. సమగ్ర పంటల బీమాను అమలు చేసి రైతులతోపాటు రైతు కూలీలు, భూమిలేని రైతులకు సైతం బీమా పథకాన్ని వర్తింపజేయాలి. కొత్త సాగు విధానంతోపాటు పంటల సమగ్ర ప్రణాళికను విడుదల చేయాలి" అంటూ బీజేపీ డిమాండ్ చేసింది.

**నా దీక్షకు మద్దతు తెలిపండి: బండి సంజయ్ –** అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పరిహారం అందించలేదని, సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నా పట్టించుకోవటం లేదని బండి సంజయ్ విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, తక్షణమే వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. వడ్ల కల్లాల వద్ద బస చేసి.. రైతులు పడుతున్న బాధలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, వడ్ల కొనుగోలు కేంద్రాలను కూడా పరిశీలిస్తామని పేర్కొన్నారు. రైతు సంఘాలు, ప్రజా సంఘాలు తన దీక్షకు సంఘీభావం తెలపాలని కోరారు. మహిళలు, వృద్దులు, విద్యార్థులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం కూడా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, 2-3 రోజుల్లో ప్రణాళికను వెల్లడిస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు.

## లోక్‌సభ ఎన్నికల్లో కుట్రకు తెరదీసిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు

రంగారెడ్డి: తుక్కుగూడలో ఈనెల 6వ తేదీన ఏఐసీసీ భారీ బహిరంగ సభకు ప్లాన్ చేసిందని.. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హాజరుకానున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు తుక్కుగూడ సభా ప్రాంగణాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి పరిశీలించారు. సభ ఏర్పాట్లు, ఇతర అంశాలపై నిర్వాహకులకు సీఎం రేవంత్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... కాంగ్రెస్‌కు తెలంగాణ కంచుకోట అని నిరూపిస్తామన్నారు. తుక్కుగూడ సభలో ఏఐసీసీ మ్యానిఫెస్టో విడుదల చేస్తుందని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే... రాష్ట్రానికి జరిగే మేలును ఈ సభ ద్వారా తెలియజేస్తామని చెప్పారు. ఈ సభలో మహిళలకు ప్రత్యేక సీట్లు ఏర్పాటు చేస్తామన్నారు. సోనియా గాంధీ ప్రకటించిన 6 గ్యారెంటీలను తెలంగాణలో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల కోడ్ రావడంతో పథకాలకు కొంత అంతరాయం కలిగిందని చెప్పారు. ఎన్నికల తర్వాత మిగతా హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**కేసీఆర్ పాపాలతోనే ఈ కరువు...** పదేళ్ల తర్వాత అయినా మాజీ సీఎం కేసీఆర్ 'పొలం బాట' పట్టడం సంతోషమని చెప్పారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయినందుకు, కవిత జైలుకు పోయినందుకు కేసీఆర్‌ను చూస్తుంటే జాలి కలుగుతుందని అన్నారు. ఆయనకు ఏ సీజన్ ఎప్పుడు వస్తుందో తెలియదా అని ప్రశ్నించారు.

కేసీఆర్ పాపాలతోనే ఈ కరువు పరిస్థితులు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఆయన చేసిన పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖాతాలో వేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధును వేయడానికి 10 నెలల సమయం తీసుకుందని చెప్పారు. 65 లక్షల రైతుల ఖాతాలో తాము రైతుబంధు వేశామని.. మిగిలింది 4 లక్షల రైతులేనని ఎన్నికలు అయిపోగానే వీరికి కూడా రైతు బంధు వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.



**రైతులపై కేసీఆర్‌ది కపట ప్రేమ :** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ మొన్నటి పర్యటనలో జనరేటర్‌తో ప్రెస్‌మీట్ పెట్టి విద్యుత్ పోయిందని తమ ప్రభుత్వంపై నిందలు వేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తాము ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తే తమను ఎక్కడికక్కడ అరెస్ట్‌లు చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాము తలుచుకుంటే కేసీఆర్ బయటకు వెళ్లేవారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ. 1500 కోట్లు ఉన్నాయని.. రైతులకు రూ.100 కోట్లు సహాయం చేయొచ్చు కదా అని చెప్పారు. ఎంపీ ఎన్నికల కోసమే కేసీఆర్ రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి సెటైర్లు వేశారు.

**బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే...** ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని పథకాలను రాష్ట్రంలో అమలు చేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అన్ని సమస్యలు ఉన్నాయని నీళ్లు ఎత్తిపోయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వేసవిలో నీటి సమస్యలు రాకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని... ఈ రెండు పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో కుట్రకు తెరదీశాయని అన్నారు. చనిపోయిన రైతుల వివరాలు ఇచ్చేందుకు కేసీఆర్‌కు 48 గంటల సమయం ఇస్తున్నానని అన్నారు. ఆలోగా రైతుల వివరాలు ఇస్తే ఎన్నికల కోడ్ ముగియగానే రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## కూటమిలో కెమిస్ట్రీ మిస్...!?

ఎంతో ఆర్భాటంగా గెలుపుని టచ్ చేయాలని టార్గెట్ ని రీచ్ కావాలని ఏపీలో కట్టిన కూటమిలో అసలైన మసలా దినుసు మిస్ అవుతోంది అని చర్చ సాగుతోంది. ఏ వంటకం రుచికరంగా తయారు కావాలంటే దినుసులు అన్నీ సమపాళ్ళలో ఉండాలి. అపుడే అది పండుతుంది. అలాగే రాజకీయ వంటకం పండాలన్నా అన్ని రాజకీయ పార్టీల మధ్య సయోధ్య ఉండాలి. కానీ ఏపీలో చూస్తే టీడీపీ కూటమిలో కీలకమైన అంశమే మిస్ అవుతోంది అని అంటున్నారు. అదే పెద్ద లోటుగా చెబుతున్నారు. సయోధ్య అన్నది ఉండాలి. సర్దుబాటు ఉండాలి. పరస్పరం నమ్మకం ఉండాలి. ఉమ్మడి అజెండా ఉండాలి, ఏకోన్ముఖమైన అజెండా ఉండాలి. కానీ టీడీపీ కూటమిలో చూస్తే అన్ని పార్టీలు కలిసింది సీట్లు పంచుకోవడానికా అన్నట్లుగానే ఉంది అని అంటున్నారు. ప్రజా సంక్షేమం కోసమే ఈ కూటమి అని చెబుతున్నా ఉమ్మడి కార్యాచరణతో ముందుకు రావడంలేదు. పైగా ఈ కూటమి ఏర్పాటు బహు తమాషాగా ఉంది అని అంటునారు. బీజేపీతో ఉంటూ జనసేన కూటమిలో కలిసింది. దాని కంటే ముందు వారాహి యాత్రలో పవన్ ఎన్నికల మ్యానిఫేస్టో అనకపోయినా కొన్ని కీలక హామీలు జనాలకు ఇచ్చారు. గత ఏడాది మహానాడులో మినీ ఎన్నికల మ్యానిఫేస్టోని టీడీపీ రిలీజ్ చేసింది. అందులో సూపర్ సిక్స్ అంటూ ఉచిత పథకాలే ఎక్కువగా ఉన్నాయి. బీజేపీ చూస్తే ఉచిత పథకాలకు వ్యతిరేకం అని అంటారు. మరి టీడీపీ ఉచిత హామీలకు బీజేపీ ఓకేనా అంటే దాని మీద స్పష్ట లేదు. బీజేపీ ఏ హామీ ఇస్తుందో కూడా తెలియదు. అదే విధంగా ప్రజా సంక్షేమం కోసమే బీజేపీతో పొత్తు అని టీడీపీ అంటున్నపుడు అందులో ప్రజలకు పనికివచ్చే పోలవరం ప్రాజెక్ట్ పూర్తి ప్రత్యేక హెూదా అమలు, విభజన హామీలను నెరవేర్చడం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దు, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు ఇత్యాది అంశాల మీద టీడీపీ బీజేపీ స్పష్టత ఇవ్వాలి కదా అన్న చర్చ వస్తోంది. మరో వైపు చూస్తే టీడీపీ అధినాయకత్వం వైసీపీని జగన్ ని గట్టిగా టార్గెట్ చేస్తోంది. అదే బీజేపీ మాత్రం ఆ విషయంలో లైట్ తీసుకుంటోంది. బీజేపీ రాజకీయ అజెండా ఏమిటి అన్నది కూడా ఇక్కడ చూడాల్సి ఉంది అని అంటున్నారు. బీజేపీ కూటమిలోకి వస్తే కచ్చితంగా చాలా అంశాలు విభజన హామీలు జనం నుంచి ప్రశ్నలుగా వస్తాయి. వాటి మీద ఈ రోజు వరకూ ఏ మాత్రం చెప్పకుండా మేమంతా ఒక్కటీ అని చెప్పుకుంటే ప్రయోజనం ఏముంది అని ప్రశ్నిస్తున్నారు. ఇక కూటమిగా ఏపీకి ఫలనా మేలు చేస్తామని చెప్పాలి. ఎంతసేపూ జగన్ మీద విమర్శలు తప్పించి కూటమి అధికారంలోకి వస్తే ఏపీని కేంద్ర సాయంతో విభజన గాయాలు లేకుండా చూస్తామని నిర్మాణాత్మకమైన హామీలు ఇవ్వలేక పోతున్నారు అన్నది కూడా ఉంది. ఇంకో వైపు చూస్తే తెలుగుదేశం 144 సీట్లలో పోటీ చేస్తోంది. బీజేపీకి 10 సీట్లు పొత్తులలో భాగంగా ఇచ్చారు. జనసేనకు 21 సీట్లు ఇచ్చారు. అయితే ఈ సీట్లలో కూడా సర్దుబాట్లు సరిగ్గా లేవని అంటున్నారు. మూడు పార్టీలలో అసంతృప్తి తీవ్ర స్థాయిలో ఉంది. తమకు అవకాశాలు లేవని ఆశావహులు మూడు పార్టీలలో గగ్గోలు పెడుతున్నారు. నాయకుల స్థాయిలో పొత్తుల విషయంలో బాగానే ఉందని పించుకున్నా గ్రౌండ్ లెవెల్ లో మాత్రం సెట్ కావడం లేదు అని అంటున్నారు. మిత్రులుగా గ్రౌండ్ లెవెల్ లో సాటి పార్టీని భావించే పరిస్థితి లేకపోవడం వల్లనే ఒక పార్టీకి టికెట్ ఇస్తే రెండవ పార్టీ వారు వీధుల్లోకి వస్తున్నారు అని అంటున్నారు. జనసేన టీడీపీ ఎప్పటి నుంచో పొత్తులలో ఉంటామని చెబుతూ ఉన్నా ఆ రెండు పార్టీల మధ్యనే అవగాహన లేకుండా పోయిందని అంటున్నారు. ఇక కొత్తగా చివరి నిమిషంలో వచ్చి బీజేపీ చేరడం వల్ల గందరగోళం మరింతగా పెరిగిందని అంటున్నారు. మరి కేవలం నలభై రోజులు మాత్రమే ప్రచారానికి వ్యవధి ఉన్న వేళ తలో దారి అన్నట్లుగా కూటమి వైఖరి ఉంటోందని అంటున్నారు. అదే విధంగా కూటమిలో కెమిస్ట్రీ వర్కౌట్ కాక పోతే అనుకున్న టార్గెట్ ని రీచ్ కాలేరు అన్న మాట కూడా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# నీటిని నింపి... దప్పిక తీర్చి



సిరిసిల్ల : రోజు రోజుకు ఎండలు మండుతున్నాయి. ఫలితంగా నీటి వనరులు పడిపోయి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. అరణ్యంలో ఊట కుంటలు, చెక్‌డ్యాంలు వట్టిపోయాయి. వన్యప్రాణులు జనావాసాల్లోకి రావడం పరిపాటైంది. పంటలను ధ్వంసం చేస్తుండటంతోపాటు వేటగాళ్ల బారిన పడుతున్నాయి. అడవి జంతువుల రక్షణతోపాటు వేసవిలో దప్పిక తీర్చేందుకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నీటి వసతులు కల్పిస్తూ మనుగడకు ముప్పువాటిల్లకుండా చూస్తున్నారు.

జిల్లాలో వేములవాడ, సిరిసిల్ల అటవీ ప్రాంతం పరిధిలో 12 సెక్షన్లు ఉన్నాయి. 44 బీట్‌లలో సుమారు 27 వేల హెక్టార్లకు పైగా అటవీ విస్తీర్ణం ఉంది. ప్రధానంగా వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో ఎక్కువ శాతం వనాలు విస్తరించాయి. ఇక్కడి వనాల్లో చిరుత పులులు, హైనాలు, తోడేళ్లు, నక్కలు, ముళ్లపందులు, మచ్చల జింకలు, మనుబోతులు, దుప్పులు, ఎలుగుబంట్లు, అడవిపందులు, కుందేళ్లు, నెమళ్లు, కొండగొర్రెలు, అడవికుక్కలతోపాటు చాలా రకాల జంతువులు ఆవాసం పొందుతున్నాయి.

నీటి జాడలు లేని చోట..

అడవుల్లో నీటి జాడలు లేని చోట 4 నుంచి 6 చదరపు కిలోమీటర్లకు ఒకటి చొప్పున సాసర్‌పిట్లను ఏర్పాటు చేశారు. 5 మీటర్‌ల వ్యాసార్థంతో వీటిని నిర్మించారు. కొత్తవి 22 సాసర్‌పిట్లు ఉండగా, పాతవి 10 ఉన్నాయి. వీటిలో వారంలో ఒకటి, రెండు సార్లు నీటిని నింపుతున్నారు. అలాగే అయిదు సోలార్ పంపుసెట్ల ద్వారా నీటిని సమకూరుస్తున్నారు. ప్రకృతి పరమైన నీటి లభ్యత ఉన్న చోట చెలిమలు ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో నీరు తగ్గడంతో మళ్లీ కొత్తగా తవ్విస్తున్నారు. అక్కడికి వచ్చి వన్యప్రాణులు వేకువజామున, సాయంత్రం పూట దప్పిక తీర్చుకుంటాయని అధికారులు చెబుతున్నారు. వేటగాళ్ల ఉచ్చుకు బలికాకుండా ప్రత్యేక నిఘా పెడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో నిత్యం బీట్ అధికారులతోపాటు బేస్‌క్యాంప్ సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారు.

సంఖ్య పెంచితే మేలు..

జిల్లాలో అటవీ విస్తీర్ణం ఎక్కువగానే ఉంది. ప్రస్తుతం ఉన్న సాసర్ పిట్లు వన్యప్రాణులకు సరిపోవనే వాదన ఉంది. వాటి సంఖ్య పెంచితే మేలు చేకూరుతుందని జంతు ప్రేమికుల అభిప్రాయం. అలాగే అటవీ ప్రాంతంలోని రహదారుల వెంబడి గతంలో ఆ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సిమెంటు తొట్టిలను ఏర్పాటు చేశారు. వేడి తీవ్రత కారణంగా అందులో నీటిని తాగితే వన్యప్రాణులు అనారోగ్యానికి గురవుతాయని అందులో నీటిని పోయడం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. రహదారుల వెంబడి సాసర్ పిట్లు ఏర్పాటు చేస్తే ఆ మార్గంలో ఉండే కోతులకు ఉపయోగంగా ఉంటుంది.

వన్యప్రాణుల రక్షణకు ప్రాధాన్యం

అడవి జంతువుల రక్షణకు ప్రాధాన్యత కల్పిస్తున్నాం. 22 సాసర్‌పిట్లు, 10 పాత కుండీల్లో నీటిని నింపుతున్నాం. అలాగే ప్రకృతి పరంగా నీటి వసతులు ఉన్న చోట చెలిమలు తోడిస్తున్నాం. అయిదు సోలార్ పంపుసెట్లతో నీటిని సమకూరుస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో జంతువులు వేటగాళ్లకు చిక్కకుండా సిబ్బందితో నిఘా పెంచాం. గతంలో ఏర్పాటు చేసిన సిమెంటు తొట్టిలలో నీరు పోస్తే వేడెక్కుతుంది. ఇలాంటి నీటిని తాగితే అవి అనారోగ్యానికి గురవుతున్నాయి. అందుకే వాటిలో నీటిని నింపడం లేదు. శ్రీనివాసరావు, అటవీ క్షేత్రాధికారి, సిరిసిల్ల

# తాగునీటి గోస తప్పేనా!



మెట్‌పల్లి : రోజురోజుకు భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. మిషన్ భగీరథ నీరు ఆశించిన స్థాయిలో అందడం లేదు. దీంతో పల్లెల్లో దాహం కేకలు మొదలయ్యాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలం డబ్బా నీటి శుద్ధికేంద్రం నుంచి జిల్లాలోని 15 మండలాల్లో 346 ఆవాస ప్రాంతాలకు భగీరథ నీరు సరఫరా అవుతుండగా, ప్రస్తుత జనాభాకు 101 ఎంఎల్‌డీల నీరు అవసరమున్నప్పటికీ 92 ఎంఎల్‌డీలు సరఫరా చేస్తున్నారు. దీంతో అన్ని గ్రామాలకు భగీరథ నీరు చేరక పాత నీటి పథకాలపై ఆధారపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో బోర్లు అడుగంటిపోగా, అధికారులు ప్రత్యేక నిధులతో కొత్తగా బోర్లు వేయడం, మోటార్లు మరమ్మతు చేస్తున్నారు. ఎక్కువగా సింగిల్‌ఫేజ్ మోటార్లు ఉండడంతో ట్యాంకులకు నీరు చేరడం లేదు. ఇంటింటికీ నల్లా నీరు అందక బోర్లు, మినీ ట్యాంకులు, తొట్టిల వద్దకు వెళ్లి ప్రజలు నీటిని తెచ్చుకుంటున్నారు. కొన్ని చోట్ల ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.పాత పథకాలే దిక్కు..మెట్‌పల్లి మండలంలో 23 గ్రామాల్లో 34 ఆవాస ప్రాంతాలకు భగీరథ నీరు సరఫరా కావాల్సి ఉండగా, ఎనిమిదింటికి మాత్రమే సరఫరా అవుతోంది. మిగతా గ్రామాల్లో పాత నీటి పథకాలే దిక్కవుతున్నాయి. ఎండలకు బోర్లు, బావుల్లో నీరు అడుగంటిపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. రంగారావుపేట, ఏఎస్‌ఆర్ తండా, ఆత్మకూర్, అందుబొందుల తండా, కేసీఆర్ తండా తదితర గ్రామాల్లో సమస్య ఎక్కువగా ఉంది. ఆయా గ్రామాల్లో నల్లాల ద్వారా నీరు సరఫరా లేక మినీ ట్యాంకులు, బోర్లు, తొట్టిల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మండలానికి రూ.28 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు కాగా, ఏఎస్‌ఆర్ తండా, కేసీఆర్ తండా, రంగారావుపేట, సత్తక్కపల్లి, వేంపేట, జగ్గాసాగర్, చెర్లకొండాపూర్, మెట్లచిట్టాపూర్ ఒడ్డెర కాలనీల్లో బోర్లు వేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు తెలిపారు. మండలంలో నీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పూర్తి స్థాయిలో సరఫరా ఏదీ?కోరుట్ల మండలంలోని చిన్నమెట్‌పల్లి, జోగన్‌పల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో భగీరథ నీరు పూర్తిస్థాయిలో సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాత్కాలికంగా నీటి కొరత తీర్చేందుకు మూడు బోర్లు వేసేందుకు నిధులు మంజూరవగా, రెండు గ్రామాల్లో బోర్లు వేశారు. భగీరథ నీరు సరఫరా సక్రమంగా లేక పలు గ్రామాల్లో పాత నీటి పథకాల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు.

కోరుట్ల మండలంలోని చిన్నమెట్‌పల్లి, జోగన్‌పల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో భగీరథ నీరు పూర్తిస్థాయిలో సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాత్కాలికంగా నీటి కొరత తీర్చేందుకు మూడు బోర్లు వేసేందుకు నిధులు మంజూరవగా, రెండు గ్రామాల్లో బోర్లు వేశారు. భగీరథ నీరు సరఫరా సక్రమంగా లేక పలు గ్రామాల్లో పాత నీటి పథకాల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు.

అరకొరగానే..

మండలంలో 17 గ్రామాలకు గాను భగీరథ నీరు అరకొరగా సరఫరా అవుతోంది. కొన్ని గ్రామాల్లో బావుల నుంచి ట్యాంకులకు చేరవేసి అక్కడి నుంచి ఇంటింటికీ సరఫరా చేస్తున్నారు. చేతిపంపులు కొన్ని చెడిపోవడంతో వాటికి సిబ్బంది మరమ్మతు చేయించారు. ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.22 లక్షలు మంజూరు కాగా అయిదు బోరు మోటార్లను ఏర్పాటు చేశారు. మరో నాలుగు ఏర్పాటు చేయనున్నారు. ఎర్రాపూర్ గ్రామానికి ఏడు నెలలుగా భగీరథ నీరు రాకపోవడంతో గుండ్లకుంటలో బోరు మోటారు ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నారు.

నదీ తీర గ్రామాల్లో తీవ్రం

ధర్మపురి మండలంలోని గోదావరి నదీ తీర గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. తాగునీటి పథకాల్లోని బావుల్లో, గోదావరి నదిలో నీటిమట్టం అడుగంటిపోవడం, భగీరథ నీరు అంతంతమాత్రంగానే సరఫరా అవుతుండడంతో నీటి ఎద్దడి పెరుగుతోంది. ప్రధానంగా ఆరెపల్లి, దొంతాపూర్, మగ్గిడి, ఎడపల్లి, జైన, ధర్మపురి ప్రాంతాల్లో నీటి కటకట ప్రారంభమైంది. ఆయా పంచాయతీలు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి నీటి సమస్య తలెత్తినా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని, నీటి ఎద్దడి లేకుండా పరిష్కరిస్తున్నామని ఏఈ వివేక్ తెలిపారు.

సగం గ్రామాలకే భగీరథ నీరు

మల్యాల: ఎండలు ముదరడంతో గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడుతోంది. పాత తాగునీటి పథకాలు నిరుపయోగంగా మారగా, భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. భగీరథ అధికారులు 78 శాతం గ్రామాలకు నీరు సరఫరా జరుగుతోందని చెబుతున్నా సగం గ్రామాలకు కూడా రావడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు కావడం కొంత ఉపశమనం కలిగిస్తోంది. రూ.18 లక్షలు నిధులు మంజూరు కాగా, బోర్లు, పైపులైన్ల నిర్మాణం చేపట్టి వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక సిద్ధం చేసినట్లు భగీరథ ఏఈ మణిదీప్ తెలిపారు.

## ఆఖరి మజిలీకి పాట్లు

పెద్దపల్లి : పల్లెలో ఆఖరి మజిలీ కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం నిర్మించిన శ్మశానవాటికలు నిరుపయోగంగా మారాయి. పర్యవేక్షణ లోపంతో నాణ్యత కొరవడి పగుళ్లబారిన పడుతున్నాయి. ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న వైకంఠధామాల మరమ్మతు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. బోరు, విద్యుత్తు వసతి సమకూర్చడం లేదు. స్థలాల కొరత, ఇతర కారణాలతో ప్రజలకు అనువైన ప్రదేశాల్లో నిర్మించలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దెబ్బతిన్న శ్మశాన వాటికల మరమ్మతు ప్రతిపాదనల నిధులకు మోక్షం లభించడం లేదు. ఒక్కో దానికి రూ.10 లక్షలుఉపాధి హామీలో ఒక్కో శ్మశానవాటికకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. పల్లె ప్రగతి ప్రాధాన్యం పనుల పరిధిలో తీసుకొని పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేశారు. జిల్లాలో 261 శ్మశానవాటికల కోసం రూ.31.11కోట్ల అంచనాతో ప్రతిపాదించగా రూ.28.34 కోట్లు ఖర్చు చేశారు. నాలుగేళ్ల క్రితం ఆగమేఘాలపై నిర్మించారు.

# లక్ష్య నిర్దేశం.. భవితకు మార్గదర్శనం

పెద్దపల్లి : చాలా మంది విద్యార్థులు ప్రతిభ ఉన్నా సామర్థ్యాలను అంచనా వేసుకోవడంలో తడబడుతున్నారు. సరైన లక్ష్యం, మార్గదర్శనం లేక ఏ కోర్సు చదవాలనే విషయమై గందరగోళానికి గురవుతున్నారు. ప్రధానంగా పేద విద్యార్థులు కళాశాల విద్యలో వెనుకబడటానికి ఇదే కారణమవుతోంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం పాఠశాల దశలోనే నైపుణ్య కోర్సులపై అవగాహన పెంచి, భవితకు బాటలు వేసేందుకు 'కెరీర్ గైడెన్స్' విధానానికి శ్రీకారం చుట్టింది. ముందుగా పీఎంశ్రీ పథకంలో ఎంపిక చేసిన పాఠశాలల్లోని 9, 10 తరగతులు, కస్తూర్బా, ఆదర్శ, గురుకులాల్లోని ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిపుణులతో మార్గదర్శనం చేస్తున్నారు. స్వీయ పరీక్ష నిర్వహణతో అంతర్గత ప్రతిభ ఆధారంగా కోర్సును ఎంపిక చేసుకొనేలా ప్రోత్సహిస్తున్నారు.

కార్పొరేట్ స్థాయి విద్యకు పీఎంశ్రీ

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించి, మెరుగైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ(ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని అమలు చేస్తోంది. ఎంపిక చేసిన బడుల్లో ప్రయోగశాలల ఏర్పాటుతో పాటు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. తొలి విడతలో మండలంలో అత్యధిక విద్యార్థులున్న పాఠశాలను ఎంపిక చేశారు. మూడేళ్ల పాటు ఏటా రూ.50 లక్షల చొప్పున నిధులు కేటాయించనున్నారు. పిల్లల్లో సృజనాత్మకత పెంచేలా డిజిటల్ తరగతులు, కృత్యాధార బోధన అందిస్తున్నారు.

తల్లిదండ్రుల పాత్రపైనా అవగాహన

ఉన్నత పాఠశాలల్లో తరగతి వారీగా సైకోమెట్రిక్ పరీక్ష నిర్వహించి విద్యార్థుల అభిరుచి, ఆలోచనలు, బలాలు, బలహీనతలు, నైపుణ్యాలను గుర్తిస్తున్నారు. ఏ కోర్సు అభ్యసిస్తే జీవితంలో స్థిరపడతారనే విషయమై వివిధ ప్రశ్నలతో విద్యార్థుల మేధస్సును పరీక్షిస్తున్నారు. చాలా మంది తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి తీసుకొచ్చి ఇష్టం లేని కోర్సులను అంటగడుతున్నారనే విమర్శలు వస్తుండటంతో వివిధ ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానం రాబడుతున్నారు. పిల్లల భవితను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్రను కూడా ప్రత్యేక శిక్షణలో ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో సొంతంగా ఆలోచనా శక్తి పెరిగి సరైన నిర్ణయం తీసుకునేందుకు దోహదపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

వ్యక్తిత్వ వికాస తరగతులు

కెరీర్ గైడెన్స్' విధానానికి ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడితో పాటు మరో ఉపాధ్యాయుడు బాధ్యులుగా వ్యవహరిస్తున్నారు. పిల్లలు భవిష్యత్తులో ఏయే కోర్సులు ఎంపిక చేసుకోవాలనే విషయమై అవగాహన కల్పించడానికి వ్యక్తిత్వ వికాస నిపుణులతో తరగతులు నిర్వహిస్తున్నారు.

పదో తరగతి తర్వాత ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేస్తే పారిశ్రామిక ఉపాధి అవకాశాలపై వివరిస్తున్నారు.

వృత్తివిద్యా కోర్సులైన నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్‌లతో ఆసుపత్రుల్లో చేయగలిగే ఉద్యోగాలపై అవగాహన కల్పిస్తున్నారు. జీవిత లక్ష్యాలపై పిల్లలకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

పకడ్బందీగా అమలుతోనే సార్థకత

పీఎంశ్రీ పథకానికి తొలి విడతలో ఉమ్మడి జిల్లాలో ఎంపికైన 67 పాఠశాలలతో పాటు మిగిలిన ఉన్నత, కస్తూర్బా, ఆదర్శ, గురుకులాల్లో విద్యార్థులకు వేసవి సెలవులకు ముందే కెరీర్ గైడెన్స్ శిక్షణ ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,488 ఉన్నత పాఠశాలల్లో 1,68,190 మంది విద్యార్థులు చదువుతున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ తర్వాత విద్య, ఉద్యోగవకాశాలు, అందుబాటులోని వ్యాపార రంగాలపై వివరిస్తున్నారు. కాగా వేసవి సెలవులు సమీపిస్తుండటంతో హడావుడిగా మానసిక వ్యక్తిత్వ నిపుణులతో తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. మొక్కుబడిగా కాకుండా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తే ఆశయం నెరవేరనుంది.

సందేహాల నివృత్తికి సహాయ కేంద్రం

పదో తరగతి, ఇంటర్మీడియట్ తర్వాత ఎంచుకునే కోర్సులపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు విద్యాశాఖ 1800 425 2425 హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నంబరును సంప్రదించి చదువు, నైపుణ్యం, అభిరుచికి తగినట్లుగా ఏ కోర్సుల్లో చేరితే ఉద్యోగావకాశాలు లభిస్తాయనే విషయాన్ని తెలుసుకోవచ్చు. విద్యార్థులు, తల్లిదండ్రుల సందేహాలను నిపుణులు నివృత్తి చేస్తారు. సైకోమెట్రిక్ పరీక్షతో ప్రతిభ అంచనా

విద్యార్థుల్లో నిబిఢీకృతమైన నైపుణ్యాలతో భవిష్యత్తు లక్ష్యాలను ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నా. పిల్లల్లోని ప్రతిభను సైకోమెట్రిక్ పరీక్ష ద్వారా అంచనా వేస్తున్నాం. స్వీయ ప్రతిభ ఆధారంగా ఏయే రంగాల్లో రాణిస్తారనే విషయాలను నిపుణులతో వివరిస్తున్నాం.

కవిత, పెద్దపల్లి జీసీడీవో

సొంత ఆలోచనలను ప్రోత్సహించాలి

పిల్లల అభిరుచిని బట్టి వారికి సరిపోయే కోర్సులు తీసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. పిల్లలపై ఒత్తిడి తేవద్దు. ఏయే అంశాల్లో వారికి ప్రావీణ్యం ఉందో తెలుసుకోవాలి. ఆ దిశగా ఆలోచించేలా మానసికంగా సిద్ధం చేయాలి. స్వేచ్ఛనిస్తే కష్టమైన కోర్సులనూ ఇష్టపడి విజేతగా నిలుస్తారు.

అనిత, మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు (ఉపాధ్యాయురాలు)

లక్ష్యంతోనే రాణిస్తామని తెలుసుకున్నా

పదో తరగతి తర్వాత అందుబాటులోని ఉపాధి కోర్సులకు సంబంధించి ఉపాధ్యాయులు కూలంకశంగా వివరించారు. లక్ష్యం ఏర్పరచుకొని చదివితే జీవితంలో రాణించవచ్చని తెలుసుకున్నా. ఎలాంటి కోర్సులో చేరితే బాగుంటుందో స్వీయ పరీక్షతో అవగాహన పెంచుకున్నా.స్వాతి, 9వ తరగతి, అప్పన్నపేట, పెద్దపల్లి మం.

## కేంద్రీయ విద్యాలయం పిలుస్తోంది

తిమ్మాపూర్ : కేంద్రీయ విద్యాలయాలలో బాలవాటిక, ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం కేంద్రీయ విద్యాలయ సంఘటన్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు తొలి ప్రాధాన్యం, కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల ఉద్యోగుల పిల్లలకు రెండో ప్రాధాన్యం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మూడో ప్రాధాన్యం, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల ఉద్యోగుల పిల్లలకు నాలుగో ప్రాధాన్యంగా ఎంపిక చేస్తారు. విద్యా హక్కు చట్టం కింద నిరుపేదలకు కూడా సీట్ల కేటాయింపు ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి 15 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిన దరఖాస్తు చేసుకోవచ్చని సంఘటన్ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సిరిసిల్ల, పెద్దపల్లి, అల్గునూర్‌లలో మూడు కేంద్రీయ విద్యాలయాలున్నాయి.బాలవాటిక-3 ఆఫ్‌లైన్ , ఒకటో తరగతి ఆన్‌లైన్‌లో..: బాలవాటిక-3 (యూకేజీ)లో ప్రవేశాల కోసం ఏప్రిల్ 1 ఉదయం 10 గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 32 సీట్లు మాత్రమే ఉంటాయి. దరఖాస్తు ఫారంలను సమీప కేంద్రీయ విద్యాలయాలలో అందజేస్తారు. అయిదేళ్ల వయసు పూర్తయి 31-03-2024 వరకు ఆరేళ్లు దాటని బాలబాలికలు అర్హులు. ఒకటో తరగతిలో ప్రవేశం పొందాలంటే ఆరేళ్ల వయసు పూర్తయి 01-04-2024 నాటికి ఎనిమిదేళ్లు దాటని బాల బాలికలు అర్హులు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
బుధవారం 3 ఏప్రిల్ 2024

# విద్యార్థులు ప్రేరణ పొందేలా

హైదరాబాద్: సాంప్రదాయ విద్య సరిహద్దులను అధిగమించి.. విద్యార్థుల ఉత్సుకతను రేకెత్తించి.. వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రేరణ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న తొమ్మిది, పది, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ ప్రోగ్రాంలో పాల్గొనేందుకు అర్హులు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని మెరిట్ ఆధారంగా మూడు స్థాయిల్లో వడపోత చేసి జిల్లాకు ఇద్దరు చొప్పున ఎంపిక చేస్తారు. ప్రేరణ కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు గుజరాత్‌లోని మెహసానా జిల్లా వాద్‌నగర్‌లోని వెర్నాక్యులర్ పాఠశాలలో వారం రోజులపాటు శిక్షణ ఉంటుంది.

ఎంపిక విధానం ఇలా..

అర్హులైన విద్యార్థులు ముందుగా %https://prerana.education.gov.in%/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వీరికి ఏప్రిల్ మొదటి రెండు వారాల్లో 'ప్రేరణ ఉత్సవ్' పేరిట పాఠశాల స్థాయిలో వక్తృత్వ, పాటలు, పెయింటింగ్, స్టోరీ రైటింగ్ వంటి పోటీలు నిర్వహిస్తారు. వీటిలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులను (1 బాలుడు, 1




బాలిక) ప్రతి పాఠశాల నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు.. ప్రేరణకు నన్ను ఎందుకు ఎంపిక చేయాలి?, భారతదేశం పట్ల నా విజన్, వికసిత్ భారత్ అనే అంశాలపై పోటీలు నిర్వహిస్తారు. వీటిలో ప్రతిభ చూపిన 30 మంది విద్యార్థులను (15 బాలురు, 15 బాలికలు) వ్యక్తిగత ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు. చివరకు జిల్లాకు ఇద్దరు చొప్పున ఎంపిక చేస్తారు. ఎన్‌సీసీ విద్యార్థులు, జాతీయ రాష్ట్రస్థాయి పోటీల్లో అవార్డులు పొందిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. వీరికి వాద్‌నగర్‌లోని ప్రేరణ సెంటర్‌లో వారం రోజులపాటు శిక్షణ ఉంటుంది. బ్యాచ్‌కు 20 మంది విద్యార్థులు చొప్పున తీసుకెళ్తారు.

ప్రత్యేక శిక్షణ తరగతులు..ప్రేరణ కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులను వాద్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని పురావస్తు, ప్రముఖ చారిత్రక కట్టడాలకు తీసుకెళ్తారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొనడంతో ఇతర రాష్ట్రాల జీవనశైలి, అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు తెలుస్తాయి. ప్రపంచంలో భారత్ అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి దోహదం చేసిన అంశాలు మొదలుకొని చంద్రుడిపై చంద్రయాన్ ల్యాండింగ్ వరకు అనేక విషయాలపై అవగాహన కల్పిస్తారు. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, అధునాతన సాంకేతికత, త్రీడీ ప్రింటింగ్, డ్రోన్‌ల ఆవశ్యకత, దేశ వారసత్వం, నాయకత్వ లక్షణాలు, భిన్నత్వంలో ఏకత్వం, కరుణ, యోగ, ధైర్య సాహసాలు దేశాభివృద్ధిలో 'వికసిత్ భారత్' పాత్ర మొదలైన అంశాల గురించి వివరిస్తారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అంజేస్తారు. ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

# ఈతకు.. సిద్ధమైన బల్దియా



హైదరాబాద్: నగరంలోని ప్రభుత్వ ఈత కొలనులు సిద్ధమయ్యాయి. పలు హోటళ్లు, ప్రైవేటు వ్యక్తులు కూడా అందుబాటులోకి తెచ్చారు. తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలను ప్రైవేటు కొలనుల్లో చేర్పించే ముందు శిక్షణ, రక్షణ, నిర్వహణ వ్యవస్థలను సరిచూసుకోవాలంటున్నారు. లేదంటే అనారోగ్య సమస్యలు తప్పవని, కొన్నిసార్లు ప్రాణాపాయం జరగొచ్చని గతానుభవాలు స్పష్టం చేస్తున్నాయి.

నిర్వహణ ఎలా ఉండాలంటే..

జీహెచ్ఎంసీ ఈత కొలనులు సంవత్సరంలో 9 నెలలు పనిచేస్తాయి. నెలకు ఒక వ్యక్తి సభ్యత్వ రుసుం రూ.500. రోజూ గంటపాటు ఈత కొట్టొచ్చు. %https://sports. ghmc.gov.in%/ వెబ్‌లింకు ద్వారా రిజిస్టరై, లాగిన్ అయ్యాక.. ఈత కొలను సేవలు ఎంచుకుని, రుసుము చెల్లించాలి. రశీదును సంబంధిత కొలను వద్దనున్న జీహెచ్ఎంసీ అధికారికివ్వాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలిచ్చి గుర్తింపు కార్డు పొందాలి.

టీబీ, హెపటైటిస్ బీ, తామర, ఇతర అనారోగ్య సమస్యలున్న వారిని అనుమతిస్తే ఇతరులకు అంటుకోవచ్చు. కొందరికి నీటిలో దిగితే ఫిట్స్ వస్తాయి. అందుకే వైద్యుడి ధ్రువీకరణ తప్పనిసరి చేసినట్లు ఖైరతాబాద్ జోన్ స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి తెలిపారు.

శిక్షకుల పర్యవేక్షణలో..

"ఈత కొలనులోని నీటిని రోజూ నాణ్యమైన క్లోరిన్‌తో శుద్ధి చేస్తాం. స్నానాల గదుల్లో శరీరాన్ని శుభ్రం చేసుకుని స్విమ్ సూట్ ధరించిన వారినే కొలనులోకి అనుమతిస్తాం. ప్రతి షిఫ్టులో నలుగురు శిక్షకులు పర్యవేక్షిస్తారు. లైఫ్ గార్డులు అందుబాటులో ఉంటాయని సికింద్రాబాద్ గేమ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు.

ఎక్కడెక్కడంటే..వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ పక్కన, వనస్థలిపురం ఫేజ్-4లో, మొఘల్‌పురలోని స్పోర్ట్స్ కాంప్లెక్సులో 2, చందూలాల్ బారాదరీ క్రీడా ప్రాంగణంలో 2, విజయనగర్‌కాలనీ-2లో, గోల్కొండ క్రీడా ప్రాంగణంలో, అంబర్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్సులో 2, అమీర్‌పేట్ స్టేడియంలో, సనత్‌నగర్‌లో, సికింద్రాబాద్‌లో, కూకట్‌పల్లిలో ఉన్నాయి. చందూలాల్ బారాదరీలోని 2 ప్రారంభమయ్యాయి. కొన్నింటిలో మరమ్మతులు జరుగుతున్నాయని, 2 వారాల్లో ప్రారంభిస్తామని జీహెచ్ఎంసీ క్రీడల విభాగం అదనపు కమిషనర్ డాక్టర్ యాదగిరిరావు తెలిపారు. లాలాపేట, కాటేదాన్‌లో అందుబాటులోకి రాలేదు.

# ఆరు రోజులు.. అరవై లక్షల బిల్లులు

హైదరాబాద్: గ్రేటర్‌లో విద్యుత్తు బిల్లులను ఆరో తేదీ లోపు జారీ చేయాలని డిస్కం సిబ్బందిని ఆదేశించింది. మార్చిలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పటికీ సాధ్యం కాలేదు. గృహజ్యోతి సున్నా బిల్లుల జారీ.. ఎన్నికల కోడ్‌తో కొన్నిచోట్ల ఆపేయడం వంటి గందరగోళ పరిస్థితుల్లో 10వ తేదీ వరకు బిల్లులు ఇచ్చారు. కొన్నిచోట్ల 12వ తేదీన ఇచ్చిన బిల్లులు కూడా ఉన్నాయి. ఏప్రిల్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ 6వ తేదీన పూర్తి చేయాల్సిందేనని క్షేత్రస్థాయికి ఆదేశాలు వెళ్లాయి. సిటీలో గృహ, వాణిజ్య, ఇతరత్రా విద్యుత్తు కనెక్షన్లు 60 లక్షల దాకా ఉన్నాయి. సగటున రోజుకు 10 లక్షల బిల్లులు జారీ చేయాల్సి ఉంటుంది.

ఆఖరి రోజు హడావుడిగా..విద్యుత్తు కార్యాలయాలు ఆదివారమైనా తీరిక లేకుండా పనిచేశాయి. మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. సాస్‌లో వివరాల నమోదుకు రాత్రి 7 గంటల వరకు పొడిగించారు. కొత్త పనుల అంచనాలు, ఒప్పందాలు, వర్క్ ఆర్డర్లు, బిల్లుల క్లెయిమ్స్, బడ్జెట్‌తో ముడిపడిన ఇతర బిల్లుల వివరాలను సాస్‌లో నమోదు చేశారు. ఒక్కో సర్కిల్‌లో వీటి విలువ ఐదారు కోట్ల



దాకా ఉంటుందని అంచనా.

గంటల్లోనే మార్చేశారు.. విద్యుత్తు ఉపకేంద్రంలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చడమంటే చాలా క్లిష్టమైన పని. కొత్తది ఏర్పాటు చేయాలంటే చాలా తతంగమే ఉంటుంది. ఈ ప్రక్రియను వినియోగదారులకు సాధ్యమైనంత తక్కువ అసౌకర్యంతో.. ప్రత్యామ్నాయగా కరెంట్ సరఫరా చేసి.. గంటల వ్యవధిలోనే జల్‌పల్లి ఉపకేంద్రంలో మార్చినట్లు ఇంజినీర్లు తెలిపారు. ఇక్కడ ఉపకేంద్రంలో 8 ఎంవీఏ సామర్థ్యం కల్గిన పవర్‌ట్రాన్స్‌ఫార్మర్(పీటీఆర్) ఉంది. 80 శాతం లోడ్‌కు ఇప్పటికే చేరుకుంది. పాత దాని స్థానంలో కొత్తగా 12 ఎంవీఏ పీటీఆర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో జల్‌పల్లి, నూరీనగర్, శ్రీరాంకాలనీ, గౌస్‌నగర్, పహాడిషరీఫ్, మామిడిపల్లి ప్రాంతాల్లోని 15వేల వినియోగదారులకు లోడ్ పెరిగినా సరఫరాకు అంతరాయం ఉండదని ఇంజినీర్లు చెప్పారు.

# నాణ్యమైన విద్య.. ఉన్నత ప్రమాణాలు




హైదరాబాద్: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలంటే.. విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా ఉండాలి. పాత విధానానికి స్వస్తి చెబుతూ.. ప్రయోగాత్మక విద్యను అందించడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయాలను ప్రారంభించింది. ఇందులో ఒకటో తరగతి ప్రవేశాలకు తాజాగా ప్రకటనను జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు సాధారణ ప్రజలకు కొన్ని సీట్లు ఉంటాయి. గతంలో ఈ పాఠశాలల్లో కేవలం ఆర్మీ, కేంద్ర సర్వీసుల్లోని పిల్లలకు మాత్రమే అవకాశం ఉండేది. కానీ తరువాత విద్యాహక్కు చట్టంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వాటి అనుబంధ సంస్థల ఉద్యోగుల పిల్లలకు ప్రవేశాలు కల్పించారు.

సీట్ల భర్తీ..

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యం

కేంద్ర ప్రభుత్వ రంగ అనుబంధ సంస్థల ఉద్యోగుల పిల్లలకు రెండో ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మూడో ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ ఉద్యోగుల పిల్లలకు నాలుగో ప్రాధాన్యం

ఆర్‌టీఈ కోటాకు కొన్ని సీట్లు కేటాయిస్తారు.

దరఖాస్తు చేసుకోండి ఇలా..

ఈ పాఠశాలలు ఘట్‌కేసర్ మండలం ఎన్ఎఫ్‌సీనగర్, ఉప్పల్‌లో ఉన్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతి ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి ఏప్రిల్‌ఒకటి నుంచి 15 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 6-8 సంవత్సరాల మధ్యలో ఉన్న వారు దరఖాస్తుకు అర్హులు. పుట్టిన తేదీ పత్రం, ఫొటో సమాచారం పొందుపర్చాలి. బీసీలు, ఓబీసీలు ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. దరఖాస్తులను పరిశీలించి, లాటరీలో ఎంపికైన విద్యార్థుల వివరాలను విద్యాలయం సంఘటన్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, సింగల్ గర్ల్ చైల్డ్‌కు లాటరీ ద్వారా ఆన్‌లైన్‌లో సీట్లు కేటాయిస్తారు. ఎంపికకి సంబంధించిన ఒకటో లిస్టు ఏప్రిల్ 19న, రెండోది 29న, మూడోది మే 8న ప్రదర్శిస్తామని అధికారులు వెల్లడించారు.

ధ్రువపత్రాలు తప్పనిసరి

హరిప్రసాద్, ప్రిన్సిపల్, ఎన్ఎఫ్‌సీనగర్ కేవీ

కేంద్రీయ విద్యాలయాల్లో సీసీఏ విధానంలో విద్యను బోధిస్తాం. విద్యార్థులకు ప్రయోగాత్మకమైన విద్యతో పాటు, ఆంగ్ల, హిందీ భాషపై పట్టు పెరుగుతుంది. క్రీడలు, సాంస్కృతిక ఇతర అంశాల్లో నైపుణ్యాలను పెంపొందించే అవకాశాలను కల్పిస్తాం. దరఖాస్తులో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రాధాన్యతాంశాలు తప్పనిసరి పాటించాలి.

# అడుగంటినా.. ఆటంకం లేకుండా

మహా నగరానికి తాగునీటిని అందించే కీలకమైన ప్రాజెక్టుల్లో నాగార్జున సాగర్ ఒకటి. ఈ జలాశయం నుంచి మూడు దశల్లో నిత్యం 270 ఎంజీడీలను జలమండలి సరఫరా చేస్తోంది. తొలుత సాగర్ జలాశయం నుంచి నీటిని పుట్టంగండి పంపుహౌస్‌కు తరలించి, అక్కడినుంచి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. తర్వాత ఈ రిజర్వాయర్ నుంచి ఎలిమినేటి మాధవరెడ్డి కెనాల్ ద్వారా జలాలను కిందకు పంపుతున్నారు. కోదండపూర్ వద్ద ఈ కాల్వ నీటిని జలమండలి భారీ గొట్టాల ద్వారా తీసుకొని.. శుద్ధి అనంతరం నగర ప్రజలకు అందిస్తోంది. గతేడాది తగినంత వరద సాగర్‌లోకి రాకపోవడంతో జలాశయంలోని ప్రస్తుత నీటి మట్టాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అటు సాగు నీటితోపాటు ఇటు నగరానికి అవసరమయ్యే తాగునీటిని అందించడంలో ఈ జలాశయం కీలకం కావడంతో జలమండలి ప్రత్యేక కార్యాచరణ రూపకల్పన చేసింది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 512 అడుగుల వరకు నీటి మట్టం ఉంది. 510 కంటే తగ్గితే పుట్టంగండి వద్ద ఉన్న పంపుహౌస్‌కు నీరు అందడం కష్టమే. దీంతో సాగర్‌లో అత్యవసర పంపింగ్‌కు జలమండలి ఇప్పటికే ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ మొదటి వారం నుంచి అత్యవసర పంపింగ్‌కు సమాయత్తమవుతోంది. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ స్థాయిలో కేఆర్‌బీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు పేర్కొంటున్నారు. నీటి మట్టాలు తగ్గినా సరే.. వచ్చే అక్టోబరు వరకు నగరానికి నీటి తరలింపులో ఎలాంటి ఇబ్బంది ఉండదని జలమండలి భరోసా ఇస్తోంది. కొన్నేళ్లుగా రిజర్వాయర్‌లో మట్టాలను పరిశీలించి ఒక అంచనాకు వచ్చినట్లు ఓ ఉన్నతాధికారి తెలిపారు. అక్టోబరు నాటికి సాగర్‌లో 502.40 అడుగుల స్థాయికి తగ్గుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ఆ లోపే వానలు కురిసి జలాశయంలోకి వరద వస్తుందని భావిస్తున్నామన్నారు. కీలకమైన ఏప్రిల్, మే నెలల్లో సైతం సాగర్ నుంచి పూర్తిగా 270 ఎంజీడీలు నగరానికి తరలించి అందిస్తామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని వివరించారు.

# పాతబస్తీని చుట్టేస్తున్న నగరం

హైదరాబాద్: పాతబస్తీకి రంజాన్ కళ అత్తరులా వ్యాపించింది. రాత్రి అయితే చాలు నగరమంతా పాతబస్తీలో గడుపుతోంది. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజాము 4 వరకూ పాతబస్తీలోని మదీన సెంటర్ కిక్కిరిసిపోతోంది. పగలంతా ఎండ వేడితో ఇంట్లోంచి కాలు బయట పెట్టలేని పరిస్థితి. పాతబస్తీలో మధ్యాహ్నం 2 గంటల నుంచి వ్యాపారం మొదలై తెల్లవారుజాము వరకూ కొనసాగుతోంది. రంజాన్ వ్యాపార కళ అడుగడుగునా కనిపిస్తోంది. తిండితో పాటు.. అలంకరణ వస్తువు లు.. పాతబస్తీలో పసందైన ఆహారం, అందుబాటు ధరల్లో కావాల్సిన వస్తువులు దొరుకుతాయి. విద్యుత్ దీపాల వెలుగుల్లో రాత్‌బజార్ మెరుస్తుంటే రంజాన్ ప్రత్యేక వంటకాలైన హలీం, దహీవడ, బిర్యానీ వంటివాటిని నగరవాసులు ఆస్వాదిస్తున్నారు. ఈదుల్‌ఫితర్ పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్థాయికి తగ్గట్టు కొత్త దుస్తులు ధరించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో దుస్తుల కొనుగోలు చేయడంతోపాటు చెప్పులు, ఆభరణాలను, ఇంటి అలంకరణ వస్తువులను జోరుగా కొంటున్నారు. వీటితోపాటు కుర్చీలు, సోఫాలు, సోఫాకవర్లు ఇలా ఒంటికి, ఇంటికి అందానిచ్చే వస్తువులతో పాటు వంటల్లో వినియోగించే దినుసులు, అక్తర్లు వంటివి బయట మార్కెట్ కంటే తక్కువకు పాతబస్తీలో దొరకడంతో రాత్‌బజార్‌లో జోరుగా వ్యాపారం కొనసాగుతుంది.

# విద్యుత్తు ఉచితం.. బడికి ప్రయోజనం




వికారాబాద్ : జిల్లాలోని పాఠశాలలకు విద్యుత్తు బిల్లులు గుదిబండగా మారాయి. ఈ బిల్లులు చెల్లించాలంటే చాలు సంబంధిత అధికారులు ఆందోళన పడిపోతున్నారు. పాఠశాలలకు విడుదలయ్యే గ్రాంట్లలో అధిక శాతం ఈ బిల్లులకే చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. వీటి నిర్వహణకు ప్రభుత్వం ఏటా కేటాయిస్తున్న నిధులు సరిపోవటం లేదు. జిల్లాలో అధిక పాఠశాలల్లో విద్యుత్తు బకాయిలు లక్షల్లో పేరుకు పోయాయి. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం బడులకు ఉచిత విద్యుత్తును అందిస్తామని ఇటీవలే ప్రకటించింది.

రూ.25 వేలు అందుకునేవే ఎక్కువ: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు నిర్వహణకు ఏటా రూ.10 వేల నుంచి లక్ష వరకు చెల్లిస్తోంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా గ్రాంట్‌ను మంజూరు చేస్తున్నారు. రూ.50 వేలు అంతకంటే ఎక్కువ నిధులు పొందే బడులు తక్కువ సంఖ్యలో ఉన్నాయి. రూ.25 వేల లోపు నిధులు వచ్చే బడులే అధికం. ఇవికూడా రెండు విడతలుగా విడుదల చేస్తున్నారు. రెండో విడత అయితే ఆర్థిక సంవత్సరం ముగుస్తుందన్న కారణంగా వారం రోజుల క్రితం విడుదల చేశారు. వీటితో స్టేషనరీ, జాతీయ పండుగల నిర్వహణ, చిన్న చిన్న మరమ్మతులు, నెట్ ఛార్జీలు, కంప్యూటర్, ల్యాబ్‌లు నిర్వహణ, విద్యుత్తు బిల్లులు, తాగునీరు ఇతర సదుపాయాల నిర్వహణకు ఖర్చు చేయాలన్న నిబంధనలు ఉన్నాయి.

వినియోగం అధికం: పాఠశాలలకు కేటగిరి-7ఏ కింద విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చారు. మొక్కలకు, ఇతర అవసరాలకు బోరు నీటిని వినియోగిస్తున్నారు. కంప్యూటర్, ప్రయోగశాలలు, తరగతి గదులు, ఉపాధ్యాయుల గదుల్లో ఫ్యాన్లు, డిజిటల్ తరగతులు, ప్రొజెక్టర్లు వంటివి ఉపయోగిస్తున్నారు. మన ఊరు-మన బడి పథకంలో ఎంపికైన పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు అందజేశారు. వీటన్నింటికీ విద్యుత్ వినియోగంతో బిల్లులు పెరుగుతూ పోతున్నాయి. పాఠశాల స్థాయిని బట్టి నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు బిల్లులు వస్తున్నాయి. ఆదర్శ పాఠశాలలకు నెలకు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు వస్తున్నాయి. ఎంతో ప్రయోజనం : గోపాల్, మండల విద్యాధికారి, నవాబ్‌పేటప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ఎంతో ప్రయోజనకరం. దీన్ని వీలైనంత తొందరగా అమలు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది.

# చివరికి నీరందక ఆగమాగం

ఎల్లారెడ్డిపేట: వేసవి ఆరంభంలోనే భూగర్భ జలాలు లోతుకు చేరుతూ ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. మార్చిలో 3.47 మీటర్ల మేర భూగర్భజల మట్టాలు దిగజారాయి. కొన్ని మండలాల్లో వరిపైరు పొట్ట, ఈనే దశలో ఉండగా మరికొన్ని మండలాల్లో గింజ గట్టిపడి కోత దశకు చేరుకుంది. ఈ సమయంలో సాగునీరు ఎక్కువగా అందించాల్సి ఉంటుంది. భూగర్భజల మట్టాలు లోతుకు వెళ్తుండటంతో వేసిన వరి పంట చేతికందుతుంటా, లేదా అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో యాసంగిలో మొత్తం 1,82,339.12 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవగా అందులో వరిని అత్యధికంగా 1,72,154 ఎకరాల విస్తీర్ణంలో వేశారు. జిల్లాలో 47,568 బోరుబావులు, బావుల ద్వారా సుమారు 35,212 హెక్టార్ల భూములకు సాగునీరు అందుతుంది. రాజరాజేశ్వర, అన్నపూర్ణ, ఎగువమానేరు, మూలవాగు ప్రాజెక్టులతోపాటు 625 చెరువులు సాగుకు అండగా నిలుస్తున్నాయి. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు నీటి వనరులు జలకళను సంతరించుకోవడంతోపాటు భూగర్భజల మట్టాలు భారీగా వృద్ధి



చెందాయి. సాగునీరు సమృద్ధిగా లభించడంతో ఆరుతడి పంటలను తగ్గించిన రైతులు వరిసాగువైపు మొగ్గు చూపారు.

వీర్నపల్లిలో అత్యధిక లోతుకు...

సీజన్ ప్రారంభంలోనే వరినాట్లు పూర్తి చేసిన మండలాల్లో పైరు కోతకు రాగా, ఆలస్యంగా నాట్లు వేసిన మండలాల్లో పొట్ట, ఈనిక దశలో ఉంది. పంటకు అధికంగా నీటిని వినియోగిస్తున్నారు. వ్యవసాయ విద్యుత్తు మోటార్లను నిరంతరంగా నడపడం వల్ల భూగర్భజల మట్టాలు పడిపోతున్నాయి. జిల్లాలో గతేడాది మార్చిలో 9.64 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా ఈ సంవత్సరం మార్చిలో 11.81 మీటర్లకు చేరుకొని 2.16 మీటర్లకు తగ్గిపోయాయి. వీర్నపల్లిలో నెల రోజుల వ్యవధిలో 11.34 మీటర్ల లోతుకు చేరుకోవడం గమనార్హం. మండలంలోని రాశిగుట్టతండా, గర్జనపల్లి తదితర గ్రామాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోవడంతో రైతులు పశువులను మేపుతున్నారు. మరో నెల రోజులు పైగా పంటకు సాగునీటిని అందించడం కీలకం. భూగర్భజల మట్టాలు వేగంగా దిగజారిపోతున్న పరిస్థితి రైతాంగంలో ఆందోళన రేకెత్తిస్తోంది.

బోర్లు వెనక్కి తగ్గాయి

నేను నాలుగెకరాల్లో వరి పంట సాగుచేశాను. ప్రస్తుతం ఈని, గింజలు ఎర్రబడే దశలో ఉంది. మరో 15 రోజుల్లోగా పంట చేతికందుతుంది. పొలానికి నాలుగు బోరుబావులు సాగునీటిని అందిస్తున్నాయి. ఊట తగ్గిపోవడం వల్ల ఇప్పుడు నెమ్మదించాయి. ఆగుతూ నీరు పోస్తున్నాయి. ఇటీవల వర్షం పడకుంటే పంట ఎండిపోయేది. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుక తరలింపునకు అనుమతి ఉంది. ఇసుక క్రమంగా తగ్గడం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి.

పొన్నవేని బాలు, రైతు, అగ్రహారం, ఎల్లారెడ్డిపేట మండలం

వరుస తడులతో నెట్టుకొస్తున్నాం

చెరువు కింద మూడు ఎకరాల్లో వరి వేశాను. ప్రస్తుతం పొలం ఈనే దశకు చేరుకుంది. చెరువులో నీటిమట్టం పూర్తిగా అడుగంటిపోవడంతో ఆ ప్రభావం బోరుబావిపై పడింది. భూగర్భజలాలు తగ్గిపోవడంతో నీరు రావడం తగ్గిపోయింది. ఇప్పుడే కమతాలకు వరుస తడులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నీరు మరింత లోతుకు దిగజారితే బోరుబావి పూర్తిగా ఎత్తేసే ప్రమాదం ఉంది.

దర్శనాల రామస్వామి, రైతు, గర్జనపల్లి, వీర్నపల్లి మండలం




హైదరాబాద్: తెలంగాణలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించే డీఎస్సీ (%ూా ఙూజ% 2024) పరీక్షకు దరఖాస్తుల గడువును విద్యాశాఖ పొడిగించింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్ అప్లికేషన్లకు నేటితో గడువు ముగియగా.. జూన్ 20 వరకు పొడిగించింది. దీంతో అభ్యర్థులు రూ.1000 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించి జూన్ 20 రాత్రి 11.50గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించుకోవచ్చు. అలాగే, డీఎస్సీ పరీక్ష తేదీలనూ అధికారులు ఖరారు చేశారు. జులై 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 11,062 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. వీటిలో 2,629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉండగా.. 727 భాషా పండితులు, 182 పీఈటీలు, 6,508 ఎస్జీటీలుబీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 220 స్కూల్ అసిస్టెంట్, 796 ఎస్జీటీ ఉద్యోగాలు ఉన్నాయి.

రాష్ట్రంలో అత్యధిక ఖాళీలు హైదరాబాద్‌లో 878 ఉండగా.. ఆ తర్వాత అత్యధికంగా నల్గొండ జిల్లాలో 605, నిజామాబాద్‌లో 601, ఖమ్మం 757, సంగారెడ్డి 551, కామారెడ్డి 506 చొప్పున ఖాళీలను భర్తీ చేయనున్నారు.

# నీటిని విడుదల చేయకపోతే ఉద్యమం చేస్తాం: హరీశ్‌రావు

సిద్ధిపేట, ఏప్రిల్ 2: కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వ నీటి నిర్వహణ, విద్యుత్ వైఫల్యమే పంట నష్టానికి కారణమని ఆరోపించారు. మంగళవారం రాష్ట్రంలో ఎండిన పంటలకు ఎకరాకు 25 వేలు నష్టపరిహారం, పంటలకు నీళ్ళు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్‌కు హరీశ్‌రావు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కరువును నివారించే ప్రయత్నాలు ప్రభుత్వం చేయడం లేదని విమర్శించారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుగా ఉంది సర్కారు తీరు అంటూ విరుచుకుపడ్డారు. కేసీఆర్ పొలం బాట పట్టాకే సర్కారు పంటల విషయంలో కళ్ళు తెరిచిందన్నారు. బీఆర్ఎస్ పోరాటాల వల్ల రైతులకు కొంత ఊరట దక్కిందన్నారు. వడగళ్ళు, ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంద రోజుల్లో చేస్తానన్న హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. ఎలక్షన్ కోడ్ ఉందని ఉత్తమ్ చావు కబురు చల్లగా చెప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను దగా చేసింది కాంగ్రెస్ అని.. వంద రోజుల తరువాతే కోడ్ వచ్చిందని బీఆర్ఎస్ నేత తెలిపారు. **ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చింది..** పంటలకు ఇస్తామన్న బోనస్ యాసంగి పంటలకు ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. ఎకరాకు 15 వేలు రైతులకు, కౌలు రైతులకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడుగడుగునా రైతులకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని ఆరోపించారు. ఇచ్చిన మాటకు కాంగ్రెస్ కట్టుబడి ఉండాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉ



న్నా లేకున్నా తమది ఎప్పుడూ రైతు పక్షమే అని స్పష్టం చేశారు. రైతుల పక్షాన కేసీఆర్ మాట్లాడితే కాంగ్రెస్ నేతలు ముప్పేట దాడికి దిగుతున్నారన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని.. కాంగ్రెస్ తెచ్చిందని వ్యాఖ్యలు చేశారు. కూడవెల్లి వాగులోకి తక్షణమే నీళ్ళు విడుదల చేయాలన్నారు. కేసీఆర్ హయాంలో ఒక్క ఎకరా ఎండలేదని.. కాంగ్రెస్ వచ్చాకే పంటలు ఎండుతున్నాయన్నారు. నీళ్ళు ఉండగా ఇవ్వకుండా పంటలు ఎండగడుతున్నారని ఆరోపణలు గుప్పించారు. 24 గంటల్లో కూడవెల్లికి నీళ్ళు ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని.. మల్లన్నసాగర్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. భట్టి ఒట్టి మాటలు కట్టిపెట్టలని హితవుపలికారు. రైతులకు 24 గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వాలన్నారు. తక్షణమే రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు.

# లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తోనే పోటీ: కడియం కావ్య




వరంగల్: లోక్‌సభ ఎన్నికల్లో తమకు బీఆర్ఎస్ తోనే పోటీ అని, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పోటీలోనే లేదని, బీఆర్ఎస్ ఆరోపణలను పట్టించుకోమని వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ.. తనకు ఎంపీ టికెట్ రావడంపై కాంగ్రెస్‌లో ఎలాంటి అసంతృప్తి లేదని.. ఎన్నికల్లో అందరినీ కలుపుకుని వెళ్తామని స్పష్టం చేశారు. మహిళల ఆరోగ్యం, విద్యపై దృష్టి పెడతామని, వరంగల్ సమస్యలపై పోరాడతామని, సమగ్రమైన ఇండస్ట్రీస్ రావాలని కడియం కావ్య అన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో మరో లోక్‌సభ స్థానానికి అభ్యర్థిని ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యను వరంగల్ అభ్యర్థిగా నిర్ణయించింది. సోమవారం జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఆమె పేరును ఖరారు చేశారు. మొత్తం నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండగా.. కేవలం వరంగల్‌కు మాత్రమే ఖరారు చేసి మరో 3 స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. కడియం కావ్య తొలుత వరంగల్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపిక కాగా, ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు ఆ పార్టీకి ప్రతికూలంగా మారడంతో పోటీ నుంచి విరమించుకుని తండ్రితోపాటు కాంగ్రెస్‌లో చేరారు. కాగా.. కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాల విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఖమ్మం నుంచి రెడ్డి వర్గానికి చెందిన నేతను ఎంపిక చేస్తే.. కరీంనగర్ నుంచి బీసీ వర్గానికి చెందిన నేతను బరిలోకి దించే అవకాశాలున్నాయి. అయితే కరీంనగర్ నుంచి ఇప్పటివరకూ చర్చకు వచ్చిన బీసీ, రెడ్డి, వెలమ సామాజికవర్గాల నేతల పేర్లను సీఈసీ భేటీలో నేతలు తిరస్కరించినట్లు సమాచారం. దీంతో ఆ స్థానానికి బీసీ అభ్యర్థిని ఎంపిక చేసి గెలిపించే బాధ్యతను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పజెప్పాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కరీంనగర్‌కు బీసీ అభ్యర్థి ఖరారైతే.. ఖమ్మం నుంచి రెడ్డి సామాజికవర్గం నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం ఖాయమని తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ఖమ్మం రేసు నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తన భార్య నందిని పేరును ఉపసంహరించుకున్నట్లు తెలిసింది. ఈ రీత్యా ఖమ్మం నుంచి పొంగులేటి ప్రసాద్ రెడ్డినే ఖరారు చేసే అవకాశాలు లేకపోలేదని పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

# కేసీఆర్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నిలకు తుక్కుగూడ వేదిక నుంచే కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తెలంగాణకు ఇవ్వనున్న ప్రత్యేక నిధులు, అనుమతులను అందులో పొందుపరుస్తామని చెప్పారు. ఏప్రిల్ 6న నిర్వహించనున్న 'జనజాతర' సభ ఏర్పాట్లను మంత్రులు, పార్టీ నేతలతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. కోలుకోలేని విధంగా భారాస నేతలు ఆర్థిక, సహజ వనరులను దోచుకున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో కరవు వచ్చిందంటూ ఇటీవల కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 80 వేల పుస్తకాలు చదివిన ఆయనకు వర్షాకాలం, చలికాలం ఎప్పుడొస్తుందో కూడా తెలియదా?అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు పదేళ్ల తర్వాతైనా రైతులు, వ్యవసాయం గుర్తొచ్చినందుకు, ఇప్పటికైనా పొలం బాట పట్టినందుకు సంతోషమని వ్యాఖ్యానించారు.




# కల్వకుంట్ల కుటుంబాన్ని వెంటాడుతున్న అరెస్టులు!

హైదరాబాద్: కల్వకుంట్ల కుటుంబంలో ఇటీవల ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరొకరు అరెస్ట్ అయ్యారు. మాజీ సీఎం కేసీఆర్ సోదరుడి కుమారుడు కల్వకుంట్ల తేజేశ్వర్ రావు అలియాస్ కన్న రావును ఆదిభట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. మరికాసేపట్లో ఆయనను పోలీసులు రిమాండ్ చేయనున్నారు. హై కోర్టులో కన్నారావు బెయిల్ రిజెక్ట్ అయ్యింది. రెండు సార్లు ముందస్తు బెయిల్ కోసం కన్నా రావు ప్రయత్నం చేశాడు. మనేగూడలో 2 ఎకరాల భూమి కబ్జాకు కన్నారావు అండ్ గ్యాంగ్ యత్నించింది. కన్నారావుతో పాటు 38 మందిపై కేసులు నమోదయ్యారు. కన్నారావు కోసం పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. కన్నారావుపై147, 148, 447, 427, 307, 436, 506, R/W149 సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. ఓ భూఆక్రమణ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావు సింగపూర్ పరారైనట్టు కొద్ది రోజుల క్రితం వార్తలొచ్చాయి. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడ పరిధి సర్వే నంబర్ 32లో ఉన్న 2.15ఎకరాలకు సంబంధించిన భూవివాదంపై ఓఎస్ఆర్ ప్రాజెక్ట్స్ డైరక్టర్ శ్రీనివాస్ ఈ నెల 3న ఆదిభట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కల్వకుంట్ల కన్నారావు సహా 38 మందిపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కన్నారావు ప్రధాన అనుచరుడు డేనియల్ సహా ఎనిమిది మందిని ఇప్పటిదాకా రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో జక్కిడి సురేందర్‌రెడ్డి, జక్కిడి హరినాథ్, కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావు, శివ, డేనియెల్ ప్రధాన నిందితులుగా ఉన్నారు. వీళ్లలో నలుగురిని ఇప్పటికే రిమాండ్ చేశారు. అయితే, తనపై ఆదిభట్ల పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ కన్నారావు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది. ఆ సమయంలో కన్నారావు పరారీలో ఉన్నారు. పోలీసుల అదుపులో ఉన్న డేనియల్ ఇచ్చిన సమాచారం ప్రకారం కన్నారావు సింగపూర్ పారిపోయినట్టు పోలీసులు గుర్తించారు. దీంతో కల్వకుంట్ల కన్నారావును పట్టుకునేందుకు అప్పటి నుంచి ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఎట్టకేలకు ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆ నలుగురినీ నిందితులుగా చేర్చాలి: రఘునందన్‌రావు



హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్‌రావు నాటకాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని భాజపా నేత రఘునందన్‌రావు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా భారాస అధినేత కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, వెంకట్రామిరెడ్డి పేర్లనూ చేర్చాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రఘునందన్ మాట్లాడారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై 2014 నుంచే విచారణ చేపట్టాలన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో రూ.మూడున్నర కోట్లు పట్టుకున్నా.. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎందుకు పిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో స్టీఫెన్ రవీంద్ర చెప్పిన రూ.30 కోట్లు ఎక్కడికి పోయాయని రఘునందన్ నిలదీశారు. ఈ విషయంలో తాను చేసిన ఫిర్యాదుపై పోలీసులు, ఉన్నతాధికారులు ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు.

# నేను అవకాశవాదిని కాదు.. అవకాశాలే నా వద్దకు వచ్చాయి : కడియం శ్రీహరి



హైదరాబాద్: కాంగ్రెస్ ఆహ్వానం మేరకు తాను, తన కుమార్తె కావ్య ఆ పార్టీలో చేరామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. “వ్యవస్థలను అపహాస్యం చేసే విధంగా కేంద్రం వ్యవహరిస్తోంది. సీబీఐ, ఈడీ కేసుల్లో ప్రతిపక్ష పార్టీ నేతలను ఇరికిస్తున్నారు. వారు భాజపాలో చేరగానే పునీతులవుతున్నారు. భాజపా ఆగడాలు అడ్డుకునేందుకు కాంగ్రెస్‌లో చేరాను. ప్రతిపక్షంలో ఉంటే నియోజకవర్గ సమస్యలు పరిష్కరించలేం. భారాసలో నాకు కేసీఆర్ ఎన్నో అవకాశాలు ఇచ్చారు. చాలా మంది ఆ పార్టీని వీడినా.. నన్నే ఎక్కువగా టార్గెట్ చేశారు. మనవరాలి వయసున్న అమ్మాయి చేతిలో ఎర్రబెల్లి ఓటమి సిగ్గుచేటు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. భారాసకు చీడపురుగులా మారారు. నేను అవకాశ వాదిని కాదు.. అవకాశాలే నావద్దకు వచ్చాయి. నన్ను రాజీనామా చేయాలని అడిగే హక్కు భారాస నేతలకు లేదు” అని కడియం అన్నారు. భారాసను కడియం శ్రీహరి, కావ్య వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. అనంతరం వరంగల్ లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కడియం కావ్యకు కేటాయించింది.

# దానం నాగేందర్‌ను గెలిపించడమే మా బాధ్యత: కోమటిరెడ్డి

హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్ పార్టీదేనని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌ది కుటుంబ పాలన అని అన్నారు. ఇదే సమయంలో కేంద్రమంత్రిగా ఉండి సికింద్రాబాద్‌కు కిషన్ రెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు. సికింద్రాబాద్ ఎంపీగా దానం నాగేందర్‌ను గెలిపించడమే మా బాధ్యత అని వ్యాఖ్యలు చేశారు. కాగా, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం తుక్కుగూడలో కాంగ్రెస్ బహిరంగ సభ ఏర్పాటపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ..'సభకు 10 లక్షల మందిని తరలిస్తాం. ఏప్రిల్ ఎనిమిదో తేదీన నాంపల్లిలో ఫిరోజ్‌ఖాన్ ఆధ్వర్యంలో మరోసారి మీటింగ్ ఉంటుంది. బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం. భువనగిరి, నల్లగొండలో ఖచ్చితంగా గెలుస్తాం. సికింద్రాబాద్‌లో కూడా దానం నాగేందర్‌ను గెలిపిస్తాం. దానం గెలుపు బాధ్యత మాదే. తెలంగాణలో పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో లేకపోయినా ఈసారి గెలిచాం. బీఆర్ఎస్ పార్టీది కుటుంబ పాలన. మాజీ మంత్రి హరీష్‌రావు మాటలకు అర్థం లేదు. కేసీఆర్ చేసిన పాపాలకు వర్షాలు కూడా పడటం లేదు. కేసీఆర్ కేబుల్ బ్రిడ్జ్ వేసి హైదరాబాద్ అభివృద్ధి అంటున్నాడు. 40వేల కోట్లతో మూసి ప్రాజెక్ట్‌ను ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తాం. కేంద్రమంత్రిగా ఉండి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌ను పట్టించుకోలేదు. ఎలాంటి అభివృద్ధి చేయలేదు. కిషన్ రెడ్డి మతాల మధ్య గొడవలు పెట్టి గెలవాలని చూస్తున్నాడు. అది సాధ్యం కాదు. కాంగ్రెస్ కచ్చితంగా 14 సీట్లు గెలుస్తుంది' అని కామెంట్స్ చేశారు. ఇక, దానం నాగేందర్ మాట్లాడుతూ..'సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి కోమటిరెడ్డి ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాను. రాబోయే ఎన్నికల్లో నేను గెలవడానికి అందరి సహకారం కావాలి. తుక్కుగూడ సభ విజయవంతం చేయడానికి సమావేశమయ్యాం' అని వ్యాఖ్యలు చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660